సామాజిక, రాజకీయ, సినీ వారపత్రిక
చరిత్ర
నిన్న జరిగింది నేటి 'చరిత్ర' - నేడు జరిగేది రేపటి 'చరిత్ర'


# మన మాట

ప్రతి పదం ప్రజల పక్షం

TELANAGANA సంపుటి 7 సంచిక 21

గురువారం | 24 అక్టోబర్ | 2024 | పేజీలు : 2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


S tv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది



# వీరనారి ఝాన్సీ లక్ష్మీ బాయి

బ్రిటిష్ వారి పెత్తనం భరతమాత మస్తకంపై నాట్యమాడుతున్న రోజులు. దాస్య శృంఖలాల్లో జాతి యావత్తూ మగ్గుతున్న కాలం. వారి దాకాలకుఅంతూపొంతూ లేని సందర్భాలెన్నో. ఈ నేపథ్యంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం దేశభక్తులెందరో పరితపించారు, పోరాటాలు చేశారు. ఇందుకోసం శాంతియుత మార్గం కొందరిదైతే.. సాయుధ పోరాటం మరికొందరిది. అటువంటి వారిలో ఝాన్సీ లక్ష్మీబాయి అగ్రగణ్యురాలు. జన్మభూమి విముక్తి కోసం రక్తతర్పణం చేసిన వీరనారీమణి ఆమె.

మోరోపంత్ తాంబే - భాగీరథీ బాయి దంపతులకు 1828 నవంబర్ 19న విక్రమనామ సంవత్సరం బహుళ పంచమి నాడు జన్మించిందామె. (1885 నవంబర్ 19 ఆమె జన్మదినమన్న మరో వాదన కూడా లేకపోలేదు. అయితే ఇందుకు ప్రామాణికత లేదనేది కొందరు చరిత్రకారుల అభిప్రాయం) కాగా, వారణాసి ఆమె జన్మస్థలం. తల్లిదండ్రులామెకు పెట్టిన పేరు మణికర్ణిక. చిన్నతనంలోనే గుర్రపు స్వారీలు చేసింది, సాముగరిడీలు నేర్చింది. ఆ విధంగా యుద్ధ విద్యల్లో తిరుగులేని సాధన ఆమెది. 18వ యేటనే వివాహమై అత్తవారింట అడుగు పెట్టింది. భర్తపేరు రాజా గంగాధరరావు నెవాల్కర్, ఝాన్సీ సంస్థానాధీశుడాయన. ఆయనకిది రెండో వివాహం . మొదటి భార్య మరణించడంతో ఆయనకీ వివాహం అనివార్యమైంది. కాగా, అత్తింటివారు మణికర్ణికకు పెట్టిన పేరు లక్ష్మీబాయి. ఝాన్సీ సంస్థానానికి రాణి అయినందున ఝాన్సీరాణి అని పిలువబడింది. అనతికాలంలోనే వారికి ఓ కుమారుడు కలిగాడు. కాని నాలుగు నెలలు తిరక్కుండానే మరణించాడు. అప్పటికే గంగాధరరావు వ్యాధిగ్రస్తుడు. అంతలోనే ఈ పుత్రవియోగం ఆయనను మరింతగా కుంగదీసింది. ఈ దిగులుతోనే మంచంపట్టాడు. బతుకుతానన్న ఆశలు ఆయనలో సన్నగిల్లాయి. దీంతో హిందూ సాంప్రదాయం ప్రకారం వారసుడ్ని ప్రకటించక తప్పని పరి స్థితి. ఈ నేపథ్యంలోనే దామోదరరావు అనే బంధువుల పిల్లవాడ్ని దత్తత చేసుకున్నాడాయన. ఈ కార్యక్రమానికి బ్రిటిష్ అధికారులూ హాజరై ఆశీస్సులందించారు. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే 1858 నవంబరు 21న గంగాధరరావు మరణించాడు.

**విప్లవ నేపథ్యం...** ఈ పరిస్థితుల్లో దత్తపుత్రుడైన దామోదరరావే సంస్థానానికి వారసుడు. కాని, లార్డ్ డెల్హౌసి ప్రవే పెట్టిన దత్తత స్వీకార నిరాకరణ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు బ్రిటిషర్లు. దీంతో దామోదరరావు వారసత్వ హక్కు చెల్లదంటూ మెలిక పెట్టారు. ఈ పరిస్థితుల్లో సంస్థానం బ్రిటిష్ రాజ్యంలో కల్సిపోవాల్సిందే. దీన్ని నివారించేందుకు లండన్ కోర్టులో దావా కూడా వేసింది లక్ష్మీబాయి. కానీ ఆ దావాను కోర్టు కొట్టేసింది. దీంతో లొంగిపోయి సంస్థానాన్ని ఆంగ్లేయులకు స్వాధీనం చేసి వెళ్లిపోవడం, లేదా తిరుగుబాటు చేసి యుద్దానికి సంసిద్ధం కావడం. రెండే మార్గాలు. బాగా ఆలోచించింది. లొంగి పోయేందుకు ఆత్మగౌరవం అంగీకరించలేదు. ఇక యుద్ధమే శరణ్యం.

**ఝాన్సీ ముట్టడి....** ఊహించినట్లుగానే బ్రిటిష్ అధికారుల నుంచి తాఖీదు అందింది. సంస్థానాన్ని విడిచి వెళ్లిళ్లాలన్నదే



అందులో ఉన్న సారాంశం. ఊహించినట్లుగానే ఆమె దాన్ని బుట్టదాఖలు చేసింది. ఇక యుద్ధం అనివార్యం . ఆరోజు రానే వచ్చింది. సర్ హ్యారోజ్ నాయకత్వంలో ఆంగ్ల సేనలు ఝాన్సీ కోటను ముట్టడించాయి. అప్పటికింకా ఆమె సరిపడా సైన్యాన్ని సమీకరించుకోనే లేదు. తనకంత సమయమూ లభించలేదు. అయినా కోటలోని కొద్దిమంది సేనల బలంతోనే ఎదురు నిలచి వీరోచితంగా పోరాడింది లక్ష్మీబాయి. ఈ సేనల్లో ఎక్కువమంది నారీమణులే. పైగా, శతృవులతో పోల్చుకుంటే తన సేనలు చాలా తక్కువ. దీంతో దరిదాపుల్లో విజయం కనిపించలేదు. అలాగని ఓటమి భారంతో తలదించి వారికి పట్టుబడేందుకు తన ఆత్మగౌరవమూ అంగీకరించలేదు. ఈ పరిస్థితుల్లో యుద్ధరంగం నుంచి తప్పుకోవడమే విజ్ఞత. ఆ ఆలోచనతోనే కొద్దిమంది అనుచరులతో అక్కడ నుంచి నిష్క్రమించింది. కాని అనుక్షణం ప్రతీకారేచ్ఛతో రగిలిపోతూనే ఉంది. అది గుండెల్లో అగ్నిజ్వాలై విప్లవోద్భ తికి మార్గదర్శనం చేస్తూనే ఉంది. ఇక మరే ప్రత్యామ్నాయాలనూ తన దరికి రానివ్వడం లేదామె. ఇప్పుడామె దేహమే ఒక జ్వలిత జ్వాల. దేశ భక్తుల్ని కూడగట్టింది. తన ప్రబోధాలే ప్రబంధాలుగా, తన అడుగు జాడలే చైతన్యదీప్తులుగా ఏకైక మార్గ నిర్దేశనంతో దండు వెడలింది. ఆ హిందూ భక్తుల నినాదాలతో ఝాన్సీ పట్టణం ప్రతిధ్వనించింది. కోటలోని ఆంగ్ల సైన్యాలు తీవ్రంగా ప్రతిఘటించాయి. అయితే ఇక్కడ మరో విశేషమూ చోటుచేసుకుంది. లోపలున్న ఆంగ్ల సేనల్లోని స్వజాతీయుల్లో దేశభక్తి బీజాలు బలంగా ఏర్పడ్డాయి. వీరు సైతం ఒక్కుమ్మడిగా విజాతీయులపై తిరగబడ్డారు. చచ్చిన ఆంగ్ల సైనికులు చావగా మిగిలిన వారు కోటను వీడి పలాయనం చిత్తగించారు. ఆత్మగౌరవం గెలిచింది. కోట లక్ష్మీ బాయి వశమైంది. జయ గీతికలతో ఝాన్సీ పండగ చేసుకుంది. వెంటనే దత్తపు త్రుడు దామోదరుడ్ని సంస్థానాధీశుడుగా నియమించి తనను గార్డియన్గా 1854 జూన్ 7

ప్రకటించుకుంది లక్ష్మీబాయి.



**ఆంగ్లేయుల మరోదాడి....** దాదాపు 11 నెలల కాలం లక్ష్మీ బాయి పాలన సవ్యంగానే జరిగింది. కాని, ఆంగ్లేయులు కేవలం ఒక సంస్థానాధీశురాలి ధిక్కారాన్ని అంగీకరిస్తారా? రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యమంటూ జబ్బలు చరుచుకుంటున్న ఆ అహంకారులు అందుకు సిద్ధంగా లేరు. తొలి దెబ్బ చవిచూచిన సేనాని హ్యూ రోజ్ ఈ దఫా మరింత జాగ్రత్తతో నిజాం,భోపాల్ సైన్యాలను సైతం సమీకరించుకొని దండు కదిలాడు. దారిలో రామ్ గఢ్, చందేరీ ప్రాంతాలు అతని వశమయ్యాయి. ముందుగానే ముప్పును పసిగట్టిన లక్ష్మీబాయి గూడా ప్రతిఘటనకు సిద్ధంగానే ఉంది. కోటగోడల మీద ఫిరంగులు సిద్ధమయ్యాయి. పురుష యోధులతోబాటు నారీమణులు సైతం తమ కత్తులకు సానపట్టి ఎదురు చూస్తున్నారు. ఆంగ్ల సైన్యం రానే వచ్చింది. ఇరువైపులా ఫిరంగులు ఘర్జించాయి. అటు వీరులు, ఇటు వీరులూ ఎక్కువ సంఖ్యలోనే బల య్యారు. కానీ ఝాన్సీసైన్యం పరిమితం. ఆంగ్ల సేనలు అపరిమితం. పైగా వారిది ఆధునిక ఆయుధ సంపత్తి. అంతేగాక కొందరు దేశ ద్రోహులు చేసిన కుట్ర సైతం హ్యారోజ్ కు కలిసొచ్చింది. ఇప్పుడు లక్ష్మీబాయి అపజయం అంచున ఉంది. ఈ పరిస్థితుల్లో శత్రువుకు చిక్కకుండా తప్పుకోవడమే విజ్ఞత. అదనుచూసి దెబ్బతీసేందుకు అవకాశమూ లభిస్తుంది. ఈ ఆలోచన రాగానే వేషం మార్చింది. పురుష వీరునిగా తయారై దత్తపుత్రుడ్ని వీపుకు కట్టుకుని కోట గోడలను దూకి వాయు వేగంతో నిష్క్రమించింది.

## ఝాన్సీ కేవలం ఒక మహిళ కాదు..ఆమె ఆదిపరాశక్తి

### రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యానికి ముచ్చెమటలు పట్టించిన కత్తి



స్వాతంత్ర్య సమరం అనగానే ఎందరో యోధులు గుర్తుకు వస్తారు. భారత దేశం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను త్యాగం చేశారు. అటువంటి వారిలో ఝాన్సీ లక్ష్మీబాయి వంటి ఆడ పులులూ ఉన్నారు. యుద్ధంలో కానీ యుద్ధ వ్యూహాల్లో కానీ ఝాన్సీ లక్ష్మీబాయి చాలా మంది పురుషుల కన్నా చాలా గొప్పగా పావులు కదిపేవారు. ఝాన్సీతో యుద్ధం అంటే చాలు అసంఖ్యాక సైనిక బలగం ఉన్న తెల్లవారు కూడా కంగారు పడేవారట. అందుకే స్వతంత్ర పోరాటంలో ఆజాద్ హింద్ ఫౌజ్ పేరిట ప్రత్యేక ఆర్మీని స్థాపించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ మహిళా విభాగానికి ఝాన్సీ లక్ష్మీ బాయి రెజిమెంట్ అని పేరు పెట్టారు. ఝాన్సీ లక్ష్మీబాయిలో ఉన్న ప్రత్యేక లక్షణం ఏంటంటే భయం అంటే ఏంటో తెలియక పోవడం. మృత్యువు కళ్ల ముందు కనిపించినా చిరు నవ్వుతో స్వాగతం పలికి శత్రువు గుండెల్లో చురకత్తి దింపిన సివంగి ఝాన్సీ లక్ష్మీబాయి. స్వాతంత్ర్య సమర యోధుల పేరిట ఎన్నో స్మారకాలు ఉన్నాయి. ఝాన్సీ లక్ష్మీబాయి పేరిట దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ స్మారక భవనాలు నిర్మించడం ఎంతైనా అవసరం.

-కొలన్ వీరేందర్ రెడ్డి

# వీరనారి ఝాన్సీలక్ష్మి బాయి



**అడుగడుగునా యుద్ధాలే....**

నాటినుంచి అనేక అవాంతరాలు ఆమెను వెంటాడాయి. హ్యూరోజ్ దళాలతో అడుగడుగునా యుద్ధాలే. కత్తి దించి విశ్రమించింది లేదు. ఇదే సమయంలో సిపాయిల తిరుగుబాటూ మొదలైంది. దీన్నే ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామమనీ అంటారు. ఇందులో సైతం ఆమె అద్వితీయ నాయకత్వ పటిమతో మార్గ నిర్దేశనం చేసింది. తాంతియా తోపే, రావూ తులారాం, నానాసాహెబ్ లాంటి విప్లవవీరులు ఆమెకు తోడయ్యారు. ఝాన్సీ నుంచి కాల్పీ వరకు వీరు అనేక యుద్ధాల్లో ఆమెకు అండగా నిలిచారు. ఈ యుద్ధాల్లోనే లెఫ్టినెంట్ బోకర్ లాంటి ఆంగ్ల సేనానుల కుత్తుకల్ని తెగదెంచింది లక్ష్మీబాయి. ఈ సందర్భంగానే సుశిక్షితమైన, అనేకవిజయాలకు కారణమైన ఆమె జవనాశ్వం మరణించింది. అయినా వెనుకంజ వేయకుండా దొరికిన గుర్రాన్ని అధిరోహించి మరో యుద్ధానికి సన్నదమైంది లక్ష్మీబాయి. ఈ యుద్దాల విజయాలతోనే కాల్ఫీ పట్టణం ఆమెకు పాదాక్రాంతమైంది. ఈ విజయాలు ఎంతో కాలం నిలవలేదు. కాల్ఫీ ముట్టడి ఆంగ్ల సేనాని హ్యూరోజ్ మహా ఆయుధ సంపత్తితో, అశేష సైనిక బలగాలతో కాల్పీని ముట్టడించాడు. ఇది ఆమెకు ఊహించని ముట్టడి. అయినా వీరోచితంగా పోరాడింది. అయినా విజయం వరించలేదు. కాల్సీ నుంచి నిష్క్రమించక తప్పని పరిస్థితి. తిరిగి కాల్పీని పట్టుకునేందుకు సాయమందిస్తానన్న గ్వాలియర్ రాజును నమ్మి ఆశ్రయించింది. కానీ అతడిది నమ్మక ద్రోహమని తొలిరోజే గ్రహించిందామె. అతడి దళాలు తమపైనే దాడి చేయడంతో రగిలిపోయింది. అపరకాళిలా మహా దేహాస్త్రమా అన్నంతగా రూపుదాల్చి గ్వాలియర్ సేనలను తరిమి కొట్టింది. బ్రతుకు జీవుడా అనుకుంటూ గ్వాలియర్ రాజు కోటను వదలిపోవడంతో గ్వాలియర్ ఆమెకు పాదాక్రాంతమైంది.

**గ్వాలియర్ ముట్టడి...** గ్వాలియర్ విజయం కూడా తాత్కాలికమే అయింది. ఎన్నిసార్లు ఓడినా హ్యూరోజ్ కు బుద్ధి రాలేదు. ఈ దఫా పెద్ద పథకమే వాడు. అత్యంత యుద్ధ నిపుణుడైన జనరల్ స్మిత్ తో కలిసి గ్వాలియర్ కోటను ముప్పేటలా ముట్టడించాడు. కోట ఆమెకు కొత్త. హస్తగతమైన తర్వాత అందులోని రహస్యా లను ఆకళింపు చేసుకునేలోపే ఈ ఉపద్రవం వచ్చి పడింది. అందులోని నిగూఢమార్గాలు పరిపూర్ణంగా తెలీని స్థితి. పూర్తి యుద్ధ తంత్రాలను రచించలేని పరిస్థితి. అయినా శత్రు సైన్యాలపై విరుచుకు పడింది. ఇక, విజయోత్సాహానికి చిహ్నంగా తలపాగా సరేసరి. ఆపాదమస్తకం మగధీరుడి వేషధారణే. అందుబాటులో ఉన్న పరిమిత సేనలతోనే రణరంగాన కరకు కత్తుల కోలాటమాడింది. ఆ ఉత్తేజం శత్రు దేహాల్లో నిస్తేజ ద్రవాలను సవింపజేసింది. ఆ తొలినాటి పోరు ఆమె తెల్లని తలపాగకు విజయ వర్ణాన్ని అద్దింది.కాని తొలినాటి యుద్ధంలో చేదు అనుభవాన్ని చవిచూసిన హ్యూరోజ్ మరునాడు మరో మహామంత్రాంగం రచించి స్వయంగా యుద్ధరంగంలో నిలిచాడు. అంతిమపోరుకు సమాయత్తమైంది. లక్ష్మీబాయి. విజయమో- వీరస్వర్గమో నినాదంతో ముందు కురికింది. నిర్భయంగా, నిర్విరామంగా, నిరాఘాటంగా పోరాడుతూనే ఉంది. శత్రువుల రక్తంతో కత్తులు ఎరుపెక్కాయి. అటు ఇటు ఎటు చూసినా ఆంగ్ల దళాలే. రెండు చేతులతో కత్తులను తిప్పుతూ శత్రువుల తలలతో బంతులాడుతోందేగాని తనసేనలు అంతరించిపోయిన వైనాన్ని గమనించలేక పోయింది. అంతలోనే జై భరతమాత అన్న నినాదం ఆమె చెవులను తాకింది. అత్యంత సన్నిహితురాలైన మందర చేసిన నినాదమది. తుపాకి గుండు తగిలి నేలకొరిగింది మందర. అగ్గి పిడుగే అయింది లక్ష్మీబాయి. ఒక్క వేటుతో తుపాకీ పేల్చిన వాడి తలను తెగ నరికింది. కాని, తనిప్పుడు పూర్తిగా శత్రుసేనల పద్మవ్యూహంలో చిక్కుకుపోయివున్న విష యాన్ని గుర్తించింది. 'పోరుకిది సమయం కాదు. ముష్కర ఆంగ్లేయులకు తను పట్టుబడేందుకు వీల్లేదు'. ఈ ఆలోచన రాగానే అడ్డోచ్చిన సైనికుల తలలను తెగదెంచుతూ , వేగంగా ముందుకెళ్ళిపోయింది. కాని, మార్గానికి అడ్డుగా ఓ పెద్ద కాలువ ప్రవహిస్తోంది. కాలువను దాటేందుకు గుర్రం తటపటాయిస్తోంది. అప్పటికే సమయం మించిపోయింది. ఆంగ్లసేనలు ఆమెను చుట్టుముట్టాయి.

**అంతిమ ఘడియలు...** అప్పటికే రక్త గాయాలతో ఆమె శరీరం నీరసించి పోయింది. యుద్ధరంగాన తనిప్పుడు ఏకాకి. రక్తసిక్తమైన శరీరం. ఆత్మబలిదానం తప్ప మరో ప్రత్యామ్నాయం కనిపించని ఆలోచనలు.కానీ ఇంతలోనే ఓ సైనికుడామె తలను వెనుకనుంచి కత్తితో నరికాడు. తల కుడిభాగం తెగిపోయింది. కుడి కన్ను విడివడి వేలాడింది. అయినా ఊపిరుండగా అపజయాన్ని అంగీకరించేందుకు సిద్ధంగా లేదామె. ఒక్క ఉదుటన ఎగసి అతడి తలను తెగదెంచింది. ఇంతలోనే మరో సైనికుడు ఆమె గుండెల్లో కత్తిని దించాడు. అయినా ఆమె జాగృతిని కోల్పోలేదు. తన దేహం ఆ ముష్కరులకు దొరకకుండా చేయాలన్నదే ఇప్పుడామె ముందున్న ఏకైక ఆలోచన. గుర్రాన్ని వేగవంతం చేసుకుంటూ మరోవైపుకు నిష్క్రమించింది. అప్పటికే శరీరంలోని శక్తి నశించి, జీవచైతన్యం దూరమై గుర్రం పైనే వాలిపోయింది. చివరి రక్తబిందువు వరకూ పోరాడిన తొట్టతొలి భారతీయ వీర నారి లక్ష్మీబాయి తన ప్రాణాలను జాతి వాయువులో లయింపజేసింది. ఆ రోజు 1858 జూన్ 18వ తేదీ. అప్పటికామె వయసు కేవలం 29 సంవత్సరాలు! జీవితమంతా అలుపెరుగని పోరాటం చేసిన ఆ వీరనారీమణికి వేవేల జోహార్లు



## స్త్రీలు ఆకాశంలోనే కాదు... యుద్ధభూమిలోనూ సగం అని నిరూపించిన ఝాన్సీ

**దురహంకార దౌర్జన్యాలపై యుద్ధం చేయడమే ఆమెకు అసలైన నివాళి**



మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. చాలా రంగాల్లో పురుషులను మించిపోయి మహిళలు దూసుకుపోతున్నారు. యుద్ధభూమిలోనూ మహిళలు రాణించాలని చాలా మంది పిలుపు నిస్తూ ఉంటారు. కానీ అందులో అర్థం లేదు. దేశం కోసం..సమాజం కోసం..రణరంగంలో సత్తా చాటడానికి మహిళలు ఎప్పుడూ ముందే ఉంటారు. దానికి ఝాన్సీ లక్ష్మీబాయే తిరుగులేని నిదర్శనం. మన తెలంగాణాలో రాణి రుద్రమ దేవి లా 19వ శతాబ్ధంలో ఝాన్సీ లక్ష్మీ బాయి పురుషులకు దీటుగా యుద్ధరంగంలో కత్తి ఝుళిపించి సెహబాష్ అనిపించుకున్నారు. అందుకే ధైర్య సాహసాలున్న ఏ మహిళనైనా ఇప్పటికీ ఝాన్సీతో పోలుస్తారు. ఝాన్సీ అడుగుజాడల్లో నడుస్తూ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడ్డమే మహిళలుగా మనం ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అవుతుంది. ప్రతీ ఆడ బిడ్డా ఝాన్సీలా తెగువ చూపించి భరత మాత రుణం తీర్చుకోవాలి.

-అర్పిత

## సిపాయిల తిరుగుబాటులో సివంగిలా ఉరికిన యోధురాలు

**ఆంగ్లేయుడి గుండెల్లో వణుకు పుట్టించిన నాయకురాలు**



భారత దేశానికి అసలైన స్వాతంత్ర్య పోరాటం 1947లో కాదు 1857లోనే జరిగింది. అదే సిపాయిల తిరుగుబాటు. ఇంగ్లీషు వాణ్ని తరిమికొట్టగలం అని సిపాయిల తిరుగుబాటులోనే ఎందరో యోధులు నిరూపించారు. అందులో ఝాన్సీ లక్ష్మీబాయి అత్యంత ముఖ్యమైన నాయకురాలు. బ్రిటిష్ వాడు తెచ్చిన దత్తత చట్టానికి వ్యతిరేకంగా కత్తి దూసిన ఝాన్సీ లక్ష్మీబాయి దేశం కోసం అహోరాత్రులూ యుద్ధభూమిలోనే కదం తొక్కింది. మహిళలపై నేరాలు, అకృత్యాలు పెరిగిపోతోన్న నేటి యుగంలో ప్రతీ మహిళా ఒక ఝాన్సీ లక్ష్మీ బాయి కావాలి. కీచక కథలకు చరమగీతం పాడ్డానికి అవసరమైతే ప్రతీ యువతి కత్తి దూయాలి.భారత దేశ స్వతంత్ర సమర చరిత్రలోనే ఝాన్సీ లక్ష్మీ బాయి జీవితం సువర్ణాక్షరాలతో లిఖించబడి ఉంది.

-సబితారెడ్డి



## అచంచల దేశభక్తికి..తిరుగులేని ధైర్య సాహసాలకు నిలువెత్తు విగ్రహం ఝాన్సీ



ఝాన్సీ లక్ష్మీ బాయి అసలు పేరు మణికర్ణిక. ఆమె జీవిత చరిత్ర కోట్లాది మందిలో స్థైర్యాన్ని నింపే అద్భుతం. ఝాన్సీని తలచుకుంటే చాలు తప్పుచేసేవారు ఎంతటి వారైనా వారితో యుద్ధం చేసి తీరాలన్న ధైర్యం వచ్చేస్తుంది. శత్రువు ఎంతటి బలశాలి అయినా ఓడించగలం అన్న నమ్మకం వస్తుంది. అదే లక్ష్మీబాయిలో ఉన్న మ్యాజిక్. నా బాల్యంలోనే ఝాన్సీ లక్ష్మీబాయి పోరాట గాథలు చదివి ఆశ్చర్యపోయాను. ఝాన్సీ జీవించింది 30 ఏళ్లే. అంత చిన్న జీవితంలోనే ఇంగ్లీషు సైన్యానికి చుక్కలు చూపించింది. ఒళ్లు గగుర్పొడిచే పోరాటాలతో అదరగొట్టింది. నిజంగా హ్యాట్సాఫ్ టూ ఝాన్సీ లక్ష్మీబాయి. నేటి అమ్మాయిలు.. అబ్బాయిలు కూడా బాల్యంనుంచే ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకుని పోరాట పటిమ అంది పుచ్చుకోవాలి.

- మల్యాల రమణ

## తెల్లవాడి గుండెల్లో నిదురించిన యోధ

**ఎన్ని తరాలు దాటినా ఝాన్సీయే స్ఫూర్తి**

స్వాతంత్ర్య సమరంలో పురుషులకు ఏ మాత్రం తీసిపోకుండా మహిళామణులు వీరో చితంగా పోరాడారు. తమ ప్రాణత్యాగాలకు సైతం వెరవలేదు. అటువంటి అరుదైన అ ద్భుతమైన యోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి. ఆడది అబల కాదు సబల అని ఇప్పుడిప్పుడు అంటున్నాం కానీ 180 ఏళ్ల క్రితమే ఝాన్సీ లక్ష్మీబాయి తెల్లవాడిపై కత్తి దూసింది. మాతృదేశానికి స్వాతంత్ర్యం తెచ్చేందుకు యుద్ధభూమిలోకి దూకి వందలాది మంది ఇంగ్లీషు సైనికులను తరిమికొట్టింది. చివరకు దేశంకోసమే ప్రాణాలు అర్పించిన మహా త్యాగశీలి ఆమె. నేటి మహిళా లోకానికి ఝాన్సీ లక్ష్మీబాయే తిరుగులేని స్ఫూర్తి. ఆమె అడుగు జాడల్లో మహిళలంతా ధైర్యంగా నిలబడి అధర్మానికి..అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడాలి.

-ఇందుకూరి సూర్యప్రభ

